క్లుప్తంగా

అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న వెన్న రాజమల్లయ్య

రామడుగు: చేవెళ్లలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించడంతో ఆదివారం మండలంలోని వెదిర గ్రామ కోనరావుపేట ఎస్సీ కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కన్వీనర్ వెన్న రాజమల్లయ్య మాట్లాడుతూ... డిక్లరేషన్‌తో ఎస్సీ, ఎస్టీలకు ఎంతో ఉపయోగం కలుగుతుందని, కాంగ్రెస్ పార్టీ వారి వెంట ఉంటుందన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మికుంట: చేవెళ్ల సభలో దళితులు, గిరిజనులకు కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ డిక్లరేషన్ ప్రకటించడం పట్ల జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్‌గౌడ్ ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. డిక్లరేషన్ ఎస్సీ, ఎస్టీ, ఉపకులాల వారి జీవితాల్లో మార్పులు తీసుకువస్తుందని, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్ వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య, విజయ డెయిరీ, మిల్క్ షెడ్ పరిధిలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో ఔట్ సోర్సింగ్ వ్యవస్థ రద్దు చేసి రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఇందుకోసం జిల్లాల పరిధిలో డిప్యూటీ డైరెక్టర్‌కి, రాష్ట్ర స్థాయిలో చైర్మన్, ఎండీ, సంబంధిత మంత్రులకు వినతి పత్రం ఇవ్వాలని తీర్మానించారు.

క్రీడలతో మానసికోల్లాసం



పరిచయం చేసుకుంటున్న నరేందర్‌రెడ్డి

రామడుగు: క్రీడలతో శారీరక, మానసికోల్లాసం, మంచి లాభాలు కలుగుతాయని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఊట్కూరి నరేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వెదిర గ్రామం అల్ఫోర్స్ బాలుర రెసిడెన్షియల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం ఖేలికి మస్తీ కార్యక్రమంలో భాగంగా క్రీడా పోటీలను నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడలకు దూరం అవుతున్నారని దీంతో మానసిక, శారీరక అభివృద్ధి సాధించలేకపోతున్నారని, పాఠశాలలో విద్యార్థులకు క్రీడల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఖోఖో, కబడ్డీ, త్రోబాల్, వాలీబాల్, ఫుట్‌బాల్, నెట్‌బాల్ వంటి పోటీలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామం ఔదర్‌పల్లిలో ఆదివారం శ్రీ హనుమాన్ దేవాలయంలో ధ్వజస్తంభం, నవగ్రహ విగ్రహాలు, యాగశాల కొత్తగా ఏర్పాటు చేయనున్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో హోమం, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు.

సేవలు కీలకం.. జీవితాలు దుర్భరం

- గాల్లో దీపంలా జీపీ కార్మికుల భద్రత
- కార్మికులపై ప్రభుత్వ శ్రద్ధ ఏదీ..?
- సమ్మెతో బీమా అమలుపై ఉత్తర్వులు జారీ
- అమలు ఎప్పుడంటున్న కార్మికులు



పారిశుధ్య పనుల్లో నిమగ్నమైన కార్మికులు

హుజూరాబాద్‌రూరల్: ఉదయం నుంచి పొద్దుపోయే వరకు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణలో కీలక బాధ్యత పంచాయతీ కార్మికులది. వీరి పట్ల ప్రభుత్వ యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరుతో కార్మికుల జీవితాలు గాల్లో దీపంలా మారాయి. గ్రామాల్లో కీలక సేవలను అందిస్తున్న వీరు.. ఉద్యోగ భద్రతకు సంబంధించిన అంశాల్లో మాత్రం దుర్భర పరిస్థితులను ఎదుర్కోవాల్సిన దుస్థితి.

మల్టీ పర్పస్ కార్మికులకు పని భారం

హుజూరాబాద్ మండలంలోని గ్రామ పంచాయతీలు వాటి అనుబంధ గ్రామాలను కలుపుకొని 23 జీపీలు ఉన్నాయి. గ్రామాల్లో పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న మల్టీ పర్పస్ కార్మికులకు పనిభారం పెరుగుతోంది. ఇంటింటా చెత్త సేకరణ చేసి వాటిని డంపింగ్‌యార్డుకు తరలిస్తారు. అక్కడ తడి, పొడి చెత్త వేరు చేయటంతో పాటుగా అదనంగా ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య బాధ్యతలను సైతం అప్పగించడంతో పనిభారం పెరిగింది. దీంతో న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సుమారు 20 రోజులకు పైగా గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేశారు. సమ్మె మూలంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ ఏదైనా కారణంతో కార్మికులు చనిపోతే పంచాయతీ పాలకవర్గం అంత్యక్రియలకు ఇది వరకు రూ.ఐదువేలు చెల్లించగా ప్రస్తుతం రూ.పది వేలకు పెంచారు. డబ్బులు కూడా పంచాయతీ తమ ఖాతా నుంచే చెల్లించాల్సి ఉంటుంది. కార్మికులకు ఇదివరకు బ్యాంకు ఖాతా తీస్తే బీమా సౌకర్యం ఉండేది. ప్రభుత్వం అది కాకుండా ఎల్ఐసీ నుంచి రూ. ఐదులక్షల వరకు బీమా కల్పించేందుకు నిర్ణయం తీసుకుంది. ఇందుకు పంచాయతీ పాలకవర్గం ప్రతినెలా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఎంత చెల్లించాలనేది ఇంకా నిర్ణయించకపోవడంతో ఉత్తర్వులతో సరిపెట్టి అమలు ఎప్పుడు చేస్తారని కార్మికులు ప్రశ్నిస్తున్నారు.

బీమా అవకాశం ఉన్నా...

కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం 2015 నుంచి ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన ప్రవేశపెట్టింది. పథకంలో చేరేందుకు 70 ఏళ్లలోపు వారు ఏడాదికి కేవలం రూ. 330 చెల్లిస్తే చాలు. ఉద్యోగ విరమణ తర్వాత కార్మికుడికి రూ.రెండు లక్షల బీమా సొమ్ము చేతికి వస్తుంది. ప్రమాదవశాత్తు మరణిస్తే బీమా సొమ్ము కుటుంబానికి అందుతుంది. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన సైతం కార్మికులకు అనువైన బీమా పథకం. ఈ పథకంలో చేరిన కార్మికులు ఏడాదికి కేవలం రూ. 12 చెల్లిస్తే ఉద్యోగ విరమణ తర్వాత రూ.రెండు లక్షలు వస్తాయి. ప్రమాదవశాత్తు మరణించినా రూ. రెండు లక్షల బీమా సొమ్ము కుటుంబానికి అందుతుంది. ఇలాంటి ప్రయోజనకరమైన స్వల్ప ప్రీమియంతో కూడిన రెండు బీమా పథకాలు అమల్లో ఉన్నా పారిశుధ్య కార్మికులకు బీమా చేర్చకపోవడం గమనార్హం. కార్మికులకు రూ. ఐదులక్షల జీవిత బీమా పథకం అమలు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. బీమాకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేయలేదు. కనీసం ఎలాంటి బీమా పథకమో చెప్పలేదు. ప్రతి కార్మికుడికి బీమా పథకం అమలు చేయాలని, కార్మికుడి ప్రీమియం మొత్తం పంచాయతీలే భరించాలని పేర్కొంది. ప్రభుత్వ ప్రకటనతో సర్పంచులు మాత్రం ఒకింత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీల్లో చేపట్టిన పనులకే బిల్లులు ఇచ్చే పరిస్థితి లేదు. జీపీ ఖాతాల్లో కనీస బ్యాలెన్స్ లేక అప్పులు చేసి కార్మికులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికుల బీమా ప్రీమియం ఎలా చెల్లిస్తామని ప్రశ్నిస్తున్నారు.

అనారోగ్యానికి గురవుతున్నాం



పదిహేనేళ్లకుపైగా గ్రామ పంచాయతీ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నా. వేతనం మినహా నాకు ఎలాంటి జీవిత బీమా తెలియదు. రోజూ దుమ్ము, ధూళిలో పనిచేస్తుండటంతో తరుచూ అనారోగ్యానికి గురవుతున్నాం. మాలాంటి కార్మికులకు ప్రభుత్వాలు జీవిత బీమా సదుపాయం కల్పించి ఆదుకోవాలి.

– నిజానపురం సంపత్, పారిశుధ్య కార్మికుడు,చెల్పూర్

బీమా కల్పించి ఆదుకోవాలి



సమయంతో సంబంధం లేకుండా ఉదయం నుంచి పొద్దుపోయే వరకు పనిచేస్తున్నాం. ఆ పని ఈ పని అనే తేడా లేకుండా అధికారులు ఏ పని చెప్పినా చేసుకుంటూ పోతున్నాం. కార్మికులకు కేంద్ర ప్రభుత్వ రెండు బీమా పథకాలు అమల్లో ఉన్నా వర్తింపజేయడంలేదు. ప్రభుత్వం కార్మికులను ఆదుకోవాలి.

– కొలిపాక ఎల్లయ్య, పారిశుధ్య కార్మికుడు,పెద్దపాపయ్యపల్లి

నిధులు రావటం లేదు



గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులే సరిగ్గా రావటం లేదు. ఆర్థిక వనరులు సైతం లేకపోవడంతో జీపీ కార్మికులకు జీతాలు చెల్లించటంలో సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికులకు బీమా డబ్బులను పంచాయతీలు చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటం సరికాదు.

– బింగి కరుణాకర్, సర్పంచ్, రంగాపూర్

ఆర్థికసాయం అందజేత

వీణవంక: మండలంలోని బొంతుపల్లి గ్రామంలో ఇటీవల తల్లిదండ్రులు మృతి చెందగా అనాథలుగా మారిన ఇద్దరి పిల్లలకు నాయీబ్రాహ్మణ మండల ఐక్యవేదిక నాయకులు ఆర్థికసాయం అందించారు. శ్రీరాముల సమ్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఏడాది క్రితం భార్య మృతి చెందింది. వీరి పిల్లలు రాజ్‌కుమార్, రమ్య అనాథలయ్యారు. విషయం తెలుసుకున్న నాయకులు రూ.21,516 అందించారు. పిల్లల చదువుకు ఐక్యవేదిక సహకరిస్తుందని నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదిర్శ వెంకటస్వామి, బాలసుందర్, రమేశ్, మండల అధ్యక్షుడు నారాయదాసు కార్తీక్, తూముల శ్రావణ్ కుమార్, ముత్యాల రవీందర్, రాము, సాగర్ ఉన్నారు.

చెక్కులు పంపిణీ

వీణవంక: మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు మంజూరయ్యాయి. ఎంపీపీ ముసిపట్ల రేణుక తిరుపతిరెడ్డి ఆదివారం చెక్కులు అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ నిరుపేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నల్ల తిరుపతిరెడ్డి, సంపత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మాల సంక్షేమ సంఘం కార్యవర్గం



చిగురుమామిడి: మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామంలో మాల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం సంఘం కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా జెల్ల ప్రతాప్, ఉపాధ్యక్షులుగా జెల్ల శ్రీనివాస్, ఆంజనేయులు, శంకర్, ప్రధానకార్యదర్శిగా జెల్ల రాజు, సహాయ కార్యదర్శులుగా కిషన్, ప్రకాశ్, కుమార్, కార్యవర్గ సభ్యులుగా రాజశేఖర్, శంకర్ బాబు, హరికృష్ణ, అరవింద్, సంతోష్, కార్తీక్, ఆంజనేయులుతో పాటు పలువురు ఎన్నికయ్యారు. మండల మాల మహానాడు నాయకుల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి



వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో రాజురెడ్డి

మానకొండూర్‌రూరల్: అర్హులు ఓటరుగా పేరునమోదు చేసుకోవాలని తహసీల్దార్ రాజు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త పునరీక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం తహసీల్దార్ పలు గ్రామాలలోని పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ సత్యనారాయణ, బీఎల్‌వోలు అరుణ, నిర్మల, విజయ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని జమ్మికుంట, కొత్తపల్లి, ధర్మారం, మండలంలోని శాయంపేట, నాగంపేట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను హుజూరాబాద్ డివిజన్ ఆర్డీవో రాజురెడ్డి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిధిలోని ప్రజాప్రతినిధుల పేర్లు ఓటరు లిస్టులో ఉన్నాయా, లేవా అనే విషయాన్ని బీఎల్‌వోలు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజని, ఆర్ఐ సంతోష్ బీఎల్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

నుస్తులాపూర్‌లో మెగా వైద్యశిబిరం



పరీక్షలు చేయించుకుంటున్న రావుల రమేశ్



చిగురుమామిడి: సుందరగిరిలో..

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో ఆదివారం దీపిక హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశారు. శిబిరాన్ని సర్పంచ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, సర్పంచ్ రావుల రమేశ్ ప్రారంభించి మాట్లాడారు. సంపూర్ణ ఆరోగ్య రక్ష గ్రామమే ధ్యేయంగా ఉచిత మెగా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తిరుపతిరెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్లు వెంకటేశ్వర్లు, నాయకులు సతీష్, ఎండీ అజారుద్దీన్ పాల్గొన్నారు .

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరిలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కరీంనగర్‌కు చెందిన సన్‌షైన్ ఆసుపత్రి సిబ్బంది బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేశ్, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ తిరుపతి, వార్డు సభ్యులు దిలీప్‌కుమార్, సంజీవ్, వైద్య నిపుణులు వాసు, యశస్విని, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్పీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న రాంచందర్‌మాదిగ

జమ్మికుంట: ఎంఎస్పీ(మహాజన సోషలిస్టు పార్టీ) బలోపేతానికి కృషి చేయాలని పార్టీ జిల్లా కన్వీనర్ రుద్రారపు రాంచందర్‌మాదిగ అన్నారు. ఆదివారం పట్టణంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నూతన కమిటీల నిర్మాణం నిర్వహిస్తామన్నారు. 29న జమ్మికుంట, 30న వీణవంక మండలాల ఎమ్మార్పీఎస్ నూతన పూర్తి స్థాయి కమిటీలను వేస్తామన్నారు. ఆయా మండలాల్లోని అన్ని గ్రామాల నుంచి ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, గ్రామ కమిటీలు, యువకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా సీనియర్ నాయకుడు రేణికుంట్ల సాగర్, ఎమ్మార్పీఎస్ హుజూరాబాద్ మండల అధ్యక్షుడు దేవునూరి రవీందర్, మడిపల్లి అశోక్, చెరుకు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో మెరిసిన పేదింటి సౌజన్య

సైదాపూర్: మండల కేంద్రంలోని వెన్కెపల్లి గ్రామానికి చెందిన బోయన సౌజన్య ఎస్సై(సివిల్)గా ఎంపికై నందున సైదాపూర్ ఎస్సై ఆరోగ్యం ఆదివారం సౌజన్యతో పాటు కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. బోయిన దుర్గ–వెంకటయ్య దంపతుల కూతురు సౌజన్య చిన్నప్పుడే తండ్రిని కోల్పోగా తల్లి దుర్గ కూరగాయలు అమ్ముతూ కుటుంబాన్ని పోసిస్తోంది. సౌజన్య డిగ్రీ చదువుతూనే 2020లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికై జగిత్యాలలో విధులు నిర్వర్తిస్తోంది. కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తూనే ఎస్సైగా రాజన్న సిరిసిల్ల జోన్‌లో ఎంపికైంది. సౌజన్యను ఆదర్శంగా తీసుకొని యువత ఉద్యోగాలకు పోటీ పడాలని ఎస్సై ఆరోగ్యం పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విద్యాన్‌రెడ్డి, సామాజిక సేవకులు కుమార్ రాజా, అశోక్, అరుణ్‌కుమార్ ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సన్మానం..

మానకొండూరరూరల్: ఇటీవల వెలువడిన ఎస్సై ఫలితాల్లో మండలంలోని పచ్చునూర్ గ్రామానికి చెందిన మొగిలి అన్వేష్, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్ వివిధ పోస్టులకు ఎంపికయ్యారు. ఆదివారం గ్రామంలోని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో యువకులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా సీతనాగరాజు మాట్లాడుతూ.. పేదకుటుంబాలకు చెందిన యువకులు కష్టపడి గ్రామానికి పేరుతీసుకువచ్చారని కొనియాడారు. యువకులపే ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

గన్నేరువరం: ప్రభుత్వం మున్నూరుకాపు కార్పొరేషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని సంఘం నాయకులు కోరారు. ఈసందర్భంగా ఆదివారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. అనంతరం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో నిర్వహించే మున్నూరుకాపు మహాసభకు మండల కోఆర్డినేటర్ బొడ్డు సునీల్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తిరుపతి, రవి, సత్తయ్య, భూపతి, బాలయ్య, రవి, వేణు, అంజయ్య, నర్సయ్య, సంజీవ్, మహేశ్ పాల్గొన్నారు.

వినోద్‌కుమార్‌ను కలిసిన మహేందర్‌రెడ్డి

గన్నేరువరం: బీఆర్ఎస్ మానకొండూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా నియామకమైన హన్మాజిపల్లె గ్రామానికి చెందిన లింగాల మహేందర్ రెడ్డి ఆదివారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌కుమార్‌తో కరీంనగర్‌లో కలిశారు. అనంతరం శాలువాతో మహేందర్‌రెడ్డిని వినోద్‌కుమార్ సన్మానించారు. అలాగే మండల కేంద్రంలో జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అందరి సహకారంతో నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దంపల్లిలో డ్రైనేజీ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ శ్రీరాంశ్యామ్

జమ్మికుంట: మండలంలోని పెద్దంపల్లి గ్రామంలో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరాంశ్యామ్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొడ్డె మమతప్రసాద్, సర్పంచ్ ఇల్లందుల అన్నపూర్ణరామ్‌రాజు, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు మోహన్‌రెడ్డి, మైస మహేందర్, తిరుపతిరెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వన్నారం, కొక్కెరకుంటలో గడపగడపకూ కాంగ్రెస్



వన్నారంలో మాట్లాడుతున్న సత్యం

రామడుగు: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం తెలిపారు. మండలంలోని వన్నారం, కొక్కెరకుంట గ్రామాల్లో ఆదివారం గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ చేపట్టనున్న పలు సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అంబేడ్కర్ అభయ హస్తం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు రూ. 12 లక్షల ఆర్థికసాయం, రూ.ఐదువందలకే సిలిండర్, ఇంటి నిర్మాణానికి రూ.ఆరు లక్షలు అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతి, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు సత్యప్రసన్న, పార్టీ బీసీ శాఖ అధ్యక్షులు పులి ఆంజనేయులుగౌడ్, ఎంపీటీసీ హరీశ్, నాయకులు కోల రమేశ్, శ్రీనివాస్‌గౌడ్, ఓంప్రకాశ్, కట్ల శంకర్, గోపాల్, లక్ష్మణ్, సుందర్, అజయ్, మహేశ్, వంశీ పలువురు పాల్గొన్నారు.

చొప్పదండిలో బీజేపీ గెలుపు ఖాయం

కర్ణాటక ఎమ్మెల్యే బసవరాజు ముత్తిముద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిముద్

గంగాధర: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో చొప్పదండి నియోజకవర్గంలో బీజేపీ విజయం సాధించడం ఖాయమని కర్ణాటక కలంబర్గీ రూరల్ ఎమ్మెల్యే బసవరాజు ముత్తిముద్ అన్నారు. బీజేపీ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా మల్యాల నుంచి గంగాధర మండలంలోని బొమ్మలమ్మగుట్ట వరకు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్రంలోని పీఎం నరేంద్రమోదీ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంలో కార్యకర్తల నిరంతర కృషి అభినందనీయమన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్‌కు ఎన్నికల సమయంలోనే ప్రజలు గుర్తుకువస్తారని, నోటికి వచ్చిన హామీలు ఇచ్చి ఎన్నికల తరువాత మర్చిపోతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, మాజీఎమ్మెల్యే బొడిగ శోభ, నాయకులు పెరుక శ్రావణ్‌కుమార్, మేకల ప్రభాకర్‌యాదవ్, బత్తుల లక్ష్మీనారాయణ, వైద రామానుజమ్, జాడి బాల్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, చైతన్య, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

22 ఏళ్ల తర్వాత ఒకచోటకు..



వీణవంక: ఇరవై రెండేళ్ల తర్వాత వారంతా ఒకే వేదికపై కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చిన్న వయస్సులో విడిపోయినవారు ఒకచోట చేరడంతో వారి సంతోషానికి హద్దులు లేకుండాపోయాయి. ఒకరినొకరు పలకరించుకుంటూ పొద్దంతా ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈసంబురాలకు మండలంలోని చల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. ఆదివారం 2001-02 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 124 మందికి 110 సమ్మేళనానికి హాజరయ్యారు. అదేవిధంగా ఉపాధ్యాయులు 16 మందికి 14 మంది కార్యక్రమానికి వచ్చారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా పాఠశాలకు తమవంతు సాహకారం అందిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రామిడి ఆదిరెడ్డి, ఎనగంటి నరేశ్ యాదవ్, గడ్డం కుమారస్వామి, నగేశ్, కర్రె నాని పలువురు ఉన్నారు.